నయా వాణిజ్య దందా!

చూడడానికి అధికారుల వలే కనిపిస్తారు. తనిఖీలకు వెళ్లినప్పుడు అధికారులు చేసే హడావిడి చేస్తారు. బిల్లులు చూపించమని గద్దిస్తారు. ఆ తర్వాత ఆయా వ్యాపారుల నుంచి అందినకాడికి దండుకుంటారు. ఇదీ వాణిజ్య పన్నుల శాఖలో డ్రైవర్ల నయా దందా!. అధికారులు చేయాల్సిన సీవీటీ(వెహికల్ చెకింగ్ ట్యాక్స్)ను డ్రైవర్లే నిర్వహిస్తుండడం వాణిజ్య పన్నుల శాఖలో పెద్ద దుమారాన్ని రేపుతోంది. అధికారులు ఇచ్చిన అలుసుతో డ్రైవర్లు అడ్డగోలుగా రెచ్చిపోతున్నారు. వ్యాపారులను జలగల్లా పట్టుకుని పీడిస్తున్నారు. తనిఖీల పేరుతో డ్రైవర్లు చేస్తున్న అరాచకాలు పరాకాష్టకు చేరుతున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.



వాణిజ్య పన్నుల శాఖలో నకిలీ సీవీటీలు

అధికారుల అవతారం ఎత్తుతున్న డ్రైవర్లు

- ఒక్కో వ్యాపారి నుంచి వేలాది రూపాయల వసూలు
- ఉన్నతాధికారుల వద్దకు చేరిన ఇద్దరు, ముగ్గురు డ్రైవర్ల వ్యవహారం
- డ్రైవర్లతో అధికారుల కుమ్మక్కు!



(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం/ విజయవాడ): ప్రతి ప్రభుత్వ శాఖకు అధికారిక వాహనాలు ఉంటాయి. వాటి సంఖ్య ప్రతి ఏటా తగ్గుతూ వస్తోంది. కొత్త వాహనాల కొనుగోలుకు బడ్జెట్ కేటాయింపులు ఉండడం లేదు. దీంతో ప్రైవేటు కారులను ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకుంటున్నాయి. ఈ విధంగానే వాణిజ్య పన్నుల శాఖలోకి అధికారుల కోసం అద్దె కారులను తీసుకున్నారు. కారుల యజమానుల వద్ద ఉండే డ్రైవర్లే ఈ వాహనాలను నడుపుతారు. వాణిజ్య పన్నుల శాఖలో సుమారుగా 20-30 ప్రైవేటు కారులు ఉన్నాయి. ఈ వాహనాలకు డ్రైవర్లుగా ప్రైవేటు వ్యక్తులే వ్యవహరిస్తున్నారు. ఒక్కో కారుకు నెలకు రూ.36 వేలను అద్దెగా వాణిజ్య పన్నుల శాఖ చెల్లిస్తోంది. ఈ వాహనాలపై పనిచేసే డ్రైవర్లు సుదీర్ఘకాలంగా ఉండడంతో ఆయా సర్కిళ్లలో ఉన్న లొసుగులను పసిగట్టి వ్యవహారాలు చక్కబెడుతున్నారు. వ్యాపార సంస్థలు, సరుకు రవాణా వాహనాలు జీఎస్టీ చెల్లించాయా లేదా అన్న వివరాలను పరిశీలించడానికి వాణిజ్య పన్నుల శాఖలో ప్రధాన కార్యాలయం నుంచి షెడ్యూల్ ఇస్తారు. దీని ప్రకారమే సర్కిళ్లలోని అధికారులు సీవీటీ(వెహికల్ చెకింగ్ ట్యాక్స్)లకు వెళ్తారు. ఈ తనిఖీలకు వెళ్లినప్పుడు సహాయకులుగా అటెండర్లు, కారు డ్రైవర్లను తీసుకెళ్తున్నారు. అధికారులు సీవీటీల్లో ఏయే వివరాలు వ్యాపారులను, సరుకు మిగతా 4లో..


అధికారులే గేట్లు తెరిచారు!

సీవీటీలకు వెళ్లినప్పుడు అధికారులు వ్యాపారులను ఏ చిన్న లోపం కనిపించినా బెదిరిస్తున్నారు. వారి నుంచి సరుకు విలువను బట్టి ముడుపులు వసూలు చేస్తున్నారు. ఈ బాధ్యతలను డ్రైవర్లు, అటెండర్లతో చేయిస్తున్నారు. దీంతో డ్రైవర్లు తామే అధికారులమన్న భావనలోకి వెళ్లిపోతున్నారు. తమ కళ్ల ముందు అధికారులు ప్రదర్శించిన అధికార దర్పాన్ని ఎలాంటి అధికారం లేకపోయినా డ్రైవర్లు చూపిస్తున్నారు. అధికారులు వ్యాపారుల నుంచి ఎంతెంత వసూలు చేశారో ప్రత్యక్షంగా చూసిన డ్రైవర్లు నకిలీ తనిఖీల్లో అదే సూత్రాన్ని అమలు చేస్తున్నారు.

అటకెక్కిన బాలల బీమా!

2009లో ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం

- ఒక్కో విద్యార్థి నుంచి ఏడాదికి రూ.5 వసూలు
- ప్రమాదంలో మరణిస్తే రూ.లక్ష సాయం
- అంగవైకల్యం సంభవిస్తే రూ.75 వేలు
- గాయపడితే రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు పరిహారం
- 11 ఏళ్లుగా అమలుకు నోచుకోని పథకం
- విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టి సారించాలని తల్లిదండ్రుల వినతి



ఆంధ్రజ్యోతి - గుడివాడ: బాలల భవితకు భరోసా కరువైంది. ఆడి పాడే వయస్సులో దురదృష్టవశాత్తు చిన్నారులకు ఏదైనా ప్రమాదం జరిగితే వారి జీవితాలకు అండగా నిలిచే బాలల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అటకెక్కించాయి. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 52,960 మంది విద్యార్థులు నష్టపోతున్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో విద్యార్థి ఏడాదికి కేవలం రూ.5 చెల్లించి రూ.లక్ష బీమా సౌకర్యం పొందేవారు. 11 ఏళ్లుగా ఈ పథకం అమలుకు నోచుకోవడంలేదు.

బాలలకు భరోసా కోసం..

ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల సంక్షేమ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బాలల బీమా పథకాన్ని 2009లో ప్రవేశపెట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో బీమా పథకం మిగతా 4లో..



బిల్లులు అవ్వక అవస్థలు

2023-24 ఆర్థిక సంవత్సరం ముందు నుంచి ఆగిపోయిన బిల్లులు

- పంచాయతీల్లో 14,15వ ఆర్థిక సంఘం నిధులు ఉన్నా వాడుకోలేని దుస్థితి
- సీఎఫ్ఎంఎస్ ద్వారా పెట్టిన బిల్లులు తిరస్కరణ
- సమస్య పరిష్కరించాలని కార్యదర్శులు, సర్పంచ్‌ల వేడుకోలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: పంచాయతీల ఖాతాల్లో నిధులు ఉన్నా వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడింది. గతంలో కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ట్రెజరీలో జమచేస్తే, సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు పెట్టుకుని డ్రా చేసుకునేవారు. 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి పంచాయతీల ఖాతాల్లో ఉన్న నగదును వినియోగించుకునేందుకు సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు పెడితే వాటిని మంజూరు చేయకుండా తిరస్కరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలని చెబుతున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 474 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసింది. ఈ నిధులు 200లకుపైగా పంచాయతీల్లో రూ.10 వేల నుంచి రూ.40 లక్షల వరకు నగదు జమ అయ్యింది. ఆయా ట్రెజరీల్లో నిల్వ ఉంది. ఈ నగదును వినియోగించుకునేందుకు వివిధ పనులకు సంబంధించిన బిల్లులను పంచాయతీ కార్యదర్శులు సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు పెడుతున్నారు. ఈ తరహా బిల్లులు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమ తులు రావాలని ట్రెజరీ అధికారులు నిలిపేస్తున్నారు.

పీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు పెడితేనే..

పంచాయతీలకు సంబంధించిన ఆర్థిక సంఘం నిధులను గతంలో కేంద్ర ప్రభుత్వం ట్రెజరీలకు జమచేసేది. 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి పంచాయతీల బ్యాంకు ఖాతాలకు ఈ తరహా నగదును జమ చేస్తోంది. ఈ నిధులను డ్రా చేసుకునేందుకు సీఎఫ్ఎంఎస్‌కు బదులుగా పీఎఫ్ఎంఎస్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. పీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు పెడితే బిల్లులు మంజూరవుతున్నాయని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ముందు 14, 15 ఆర్థిక సంఘం ద్వారా పంచాయతీలకు విడుదలైన నిధులను మాత్రం వాడుకోకుండా పెండింగ్‌లో పెడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో వెసులుబాటును ఇచ్చేలా జిల్లాపంచాయతీ కార్యాలయ అధికారులు, కలెక్టర్ ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి సమస్యకు పరిష్కారం చూపాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు కోరుతున్నారు.

కరిగిపోతున్న ద్వీపం

133 ఎకరాల భవానీ ఐల్యాండ్ 120 ఎకరాలకు పరిమితం

- 2009 నుంచి తరచూ కృష్ణానదికి వరదలు
- రూ.కోట్ల అభివృద్ధి పనులు వరదపాలు
- ద్వీపం రక్షణకు శాశ్వత పరిష్కారం అవసరం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణానదికి తరచూ వస్తున్న వరదలతో భవానీ ద్వీపం విస్తీర్ణం తగ్గిపోతోంది. 133 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ద్వీపం ప్రస్తుతం 120 ఎకరాలకు చేరింది. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణం కనుమరుగైంది. గతేడాది రికార్డు స్థాయిలో వచ్చిన వరద కారణంగా ఆరు ఎకరాల విస్తీర్ణం కొట్టుకుపోయింది. భవానీ ద్వీపానికి 2009 నుంచి 2025 వరకు తరచూ వస్తున్న వరదల వల్ల క్రమంగా భారీ స్థాయిలో కోతకు గురవు తోంది. 2009లో కృష్ణానదికి 10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినపుడు మొదటిసారి కోతకు గురైంది. ప్రస్తుత టవర్ ఏరియా దాటి ముందుకు ఉండే ద్వీపం కాస్తా.. టవర్ అంచు వరకు వెళ్లిపోయింది. 2009 నుంచి 2024 వరకు చూస్తే భవానీ ద్వీపానికి మొత్తం ఎనిమిది సార్లు వరదలు వచ్చాయి. 2024లో రికార్డు స్థాయిలో వచ్చిన 12 లక్షల క్యూసెక్కుల వరద కారణంగా భవానీ ద్వీపానికి తీవ్ర నష్టం జరిగింది. కృష్ణానదికి 2009కి పూర్వం కూడా వరదలు వచ్చాయి. అప్పట్లో పెద్దగా కోతకు గురి కావటం కానీ, నష్టపోవటం కానీ జరగలేదు. అప్పట్లో పర్యాటకంగా భవానీ ద్వీపంలో పెద్దగా పెట్టుబడులు కూడా పెట్టలేదు. విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానదికి వరదలు రావటం రివాజుగా మారిపోయింది. ఉత్తరాది రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానదికి తరచూ వరద వస్తోంది. మరీ ముఖ్యంగా మహారాష్ట్రలో కురిసే భారీ వర్షాలతో కృష్ణానదికి వరద ఉప్పొంగుతోంది. ఉత్తరాది వర్షాలతో పాటు, పొరుగు రాష్ట్రం తెలంగాణలో కూడా ఇటీవల కాలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏడాదిలో మూడు నుంచి నాలుగు సార్లు వరదలు వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ ఏడాది మిగతా 4లో..

ద్వీపం రక్షణకు చర్యలు అవసరం

భవానీ ద్వీపాన్ని ప్రభుత్వం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. రాజధాని అమరావతికి కూత వేటు దూరంలో కృష్ణానదిలో సహజసిద్ధమైన ద్వీపం ఇది. భవానీ ద్వీపం కనుమరుగు కాకుండా ఉండాలంటే తక్షణం భవానీ ద్వీపాన్ని ఇప్పుడున్న పరిస్థితుల నుంచి కాపాడాలి. దీని కోసం రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఒకటి ద్వీపం చుట్టూ రిటెయినింగ్ వాల్ నిర్మించటం.. లేదంటే పూర్తిస్థాయిలో స్టీల్ షీటింగ్‌ను పైలింగ్ చేయటం వంటి చర్యల ద్వారానే భవానీ ద్వీపాన్ని కాపాడుకోవటం సాధ్యమవుతుందని నిపుణులు అంటున్నారు. లేనిపక్షంలో పెట్టుబడుల పరంగానూ, విస్తీర్ణంగానూ భవానీ ద్వీపానికి నష్టం జరిగే అవకాశం ఉంది.



హుండీలపైనే ఆశలు!

- దసరా ఉత్సవ ఖర్చు రూ. 15 కోట్లు
- ఈ ఏడాది టికెట్ల రూపంలో రూ. కోటి ఆదాయం కోల్పోయిన దేవస్థానం
- నేటి నుంచి దుర్గగుడి హుండీల ఆదాయం లెక్కింపు
- గతేడాది ఖర్చు రూ.13 కోట్లు.. ఆదాయం రూ.10.50 కోట్లు

4లో

రైల్వేలో దసరా జోష్!

ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిన విజయవాడ డివిజన్

- శనివారం 2.80 లక్షల మంది ప్రయాణం.. రూ.5 కోట్ల ఆదాయం
- ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల నుంచి భారీగా భవానీల రాక
- డివిజన్ ఆదాయంలో సింహభాగం విజయవాడ రైల్వేస్టేషన్‌దే !
- ఒక్కరోజే 82 వేల మంది ప్రయాణికులు ..రూ. 2 కోట్ల ఆదాయం
- ఉద్యోగుల సమష్టి కృషి ఫలితమే : డీఆర్ఎం మోహిత్ సోనాకియా



కనకదుర్గమ్మ దసరా ఉత్సవాల నేపథ్యంలో విజయవాడ రైల్వే డివిజన్ రికార్డు స్థాయిలో ఆదాయాన్ని ఆర్జించింది. శనివారం ఒక్క రోజే 2.80 లక్షల మంది ప్రయాణం చేయడం ద్వారా రూ. 5 కోట్ల ఆదాయాన్ని సాధించి చరిత్ర సృష్టించింది. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలోనే ఏ డివిజన్ కూడా ఒక్క రోజులో ఇంత ఆదాయాన్ని సాధించలేదు. తొలి సారిగా ఈ రికార్డును విజయవాడ రైల్వే డివిజన్ దక్కించుకుంది.

విజయవాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకునేందుకు రైళ్లలో విజయవాడ తరలివచ్చారు. నవరాత్రుల్లో ప్రతి రోజూ రైళ్లు కిక్కిరిసిపోయి నడిచాయి. దసరా పండగ తర్వాత ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాలు, రాయలసీమ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భవానీలు కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి వచ్చారు. దీంతో శనివారం ఒక్క రోజే రికార్డు స్థాయిలో 2.80 లక్షల మంది బయట ప్రయాణికులు రాకపోకలు సాగించారు. లోకల్‌గా కూడా ప్రయాణాలు చూస్తే మొత్తంగా 5.5 లక్షల మంది ప్రయాణికులు చేశారు. శనివారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను 1.90 లక్షల మంది దర్శనం చేసుకోవటానికి వచ్చారు. ఈ నేపథ్యంలో 82 వేల మంది విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించారు. విజయవాడ రైల్వేస్టేషన్ ఒక్కటే రూ.2 కోట్ల ఆదాయాన్ని సాధించింది. బయటి నుంచి వచ్చిన ప్రయాణికులు కాకుండా లోకల్‌గా కూడా కలిపితే విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి 1.7 లక్షల మంది ప్రయాణాలు చేశారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో విజయవాడకు పోటెత్తుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని విజయవాడ రైల్వే డివిజనల్ అధికారులు మిగతా 4లో..



శీఘ్ర దర్శనం

ఇంద్రకీలాద్రిపై సాధారణ స్థితి

- క్రమంగా తగ్గుతున్న భవానీల రద్దీ
- హోల్డింగ్ పాయింట్లు రద్దు
- కమాండ్ కంట్రోల్ సెంటర్ మూసివేత

విజయవాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ క్రమంగా తగ్గుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వచ్చినట్టుగా క్యూలైన్లలోకి చేరుకుంటున్నారు. వినాయకుడి ఆలయం నుంచి క్యూలైన్లలో ఘాట్ రోడ్డు మీదుగా ప్రధానాలయానికి వెళ్తున్నారు. భక్తులకు దర్శన సమయం గంట పడుతోంది. భవానీల సంఖ్య తగ్గడంతో అధికారులు హోల్డింగ్ పాయింట్లను రద్దు చేశారు. అదేవిధంగా మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మూసివేశారు. సెప్టెంబరు 22 నుంచి ప్రారంభమైన దసరా శరన్నవరాత్రులు మొదలు శనివారం వరకు మొత్తం 16 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది ఐదారు లక్షల మంది భవానీలు మాలలు ధరించారని గురుభవానీలు చెబుతున్నారు. దసరా ఉత్సవాలు పూర్తయిన మూడు, నాలుగు రోజుల వరకు భవానీల తాకిడి ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న భవానీలు దాదాపుగా మిగతా 4లో..

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా అంబటిపూడి సుబ్రహ్మణ్యం ఎన్నిక

4లో

పీడీఎస్ అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలి

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

పీడీఎస్ అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలి

» మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పంపిణీ చేసే పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందజేస్తున్న సుమారు 28లక్షల టన్నుల బియ్యంలో సుమారు మూడింట రెండువంతుల బియ్యంలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. కిలో 8 నుంచి 10 రూపాలయల చొప్పున బ్రోకర్లకు విక్రయిస్తున్నారని, వారు కిలో రూ.18కి రైస్‌మిల్లర్లకు విక్రయిస్తున్నట్టు చెప్పారు అదే బియ్యాన్ని ప్రాసెస్ చేసి సుమారు కిలో రూ.33లకు ప్రభుత్వానికి, కాకినాడ పోర్టు ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారని ఆరోపించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా అంబటిపూడి సుబ్రహ్మణ్యం ఎన్నిక

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడుగా అంబటిపూడి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మచిలీపట్నం కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి ఎన్నికల్లో సుబ్రహ్మణ్యం నూతన అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా వి.సాంబశివరావు, కార్యదర్శులుగా పి.శివాజీగణేష్, సీహెచ్. నాగప్రసాద్, వై.శ్రీనివాసరావు, ఎన్.శివలక్ష్మీ, వైవీ కృష్ణకాంత్, ఉపాధ్యక్షులుగా పి.సత్యనారాయణ, జీకే కిరణ్‌కుమార్, డి.సాంబశివరావు, నాగరాజు, కళ్యాణి ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎ.రామ్‌గోపాల్, జి.వెంకటేశ్వరరావు, సీహెచ్ నారాయణమూర్తి, ఎస్.పద్మావతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఎన్నికల పరిశీలకురాలిగా ఉపాధ్యక్షురాలు ఎం.అనిత వ్యవహరించారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రామారావు, పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్, జిల్లా పూర్వ అధ్యక్ష కార్యదర్శులు సీతారామయ్య, టి.కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

సమస్యలపై పీహెచ్‌సీ వైద్యుల దీక్ష

ధర్నాచౌక్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని పీహెచ్‌సీ వైద్యులు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో నిరాహార దీక్షను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇచ్చిన హామీ మేరకు ఇన్‌సర్వీస్ పీజీ కోటాలో 20 శాతం కొనసాగించాలన్నారు. 20 ఏళ్లుగా పీహెచ్‌సీ వైద్యులకు ఎటువంటి ప్రమోషన్లు కల్పించడం లేదని వాపోయారు. ఆటవీ ప్రాంతాల్లో సేవచేస్తున్న వైద్యులకు ట్రైబల్ అలవెన్స్ అందడంలేదన్నారు. గత మూడేళ్లుగా నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదన్నారు. ఇతర వైద్యసంఘాలతో మాదిగానే తమసంఘంతో కూడా గ్రీవెన్స్ కన్సల్టేషన్, ప్లానింగ్ చర్చలు జరపాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డాక్టర్ రవీంద్ర, డాక్టర్ కిషోర్ పలువురు వైద్యులు పాల్గొన్నారు.



ఎంపీ శివనాథ్‌ను శాలువాతో సత్కరించిన జైన సంఘం నిర్వాహకులు

విజయవాడ అభివృద్ధిలో జైనుల పాత్ర కీలకం

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగర అభివృద్ధి, వాణిజ్య రంగం, సామాజిక సేవల్లో జైనుల పాత్ర కీలకమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని వన్‌టౌన్ (తమినవారి వీధి) జైన్ టెంపుల్ వీధిలో ఆదివారం ఘనంగా శ్రీసంభవనాథ్ జైన్ శ్వేతాంబర్‌మూర్తి పూజక్ సంఘం ఆధ్వర్యంలో మెగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన మహోత్సవానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు ఆహారం వడ్డించారు. ఈ సందర్భంగా ఎంపీ జైన సమాజ ఆధ్యాత్మిక సంప్రదాయాలు, సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం జైనుల సంప్రదాయ రీతిలో ఎంపీకి సంఘం సభ్యులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మెగా అన్నదాన కార్యక్రమం 25ఏళ్లు పూర్తి చేసుకోవడం విశేషమన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు జయంతి లాల్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జైనులు, భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

దుర్గగుడికి కంప్యూటర్, ప్రింటర్లు విరాళం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన టీడీపీ అధికార ప్రతినిధి ఎ.ఎస్.రావు కుటుంబసభ్యులతో కలిసి రూ.లక్ష విలువ చేసే కంప్యూటర్, రెండు ప్రింటర్లను ఆదివారం ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం, చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

కేంద్ర సహాయ మంత్రికి ఘనస్వాగతం

గన్నవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అధవాలేకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుపతి నుంచి ఇండిగో విమానంలో ఆదివారం ఇక్కడికి విచ్చేసిన ఆయనకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం, సాంఘిక సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ జె.రంగలక్ష్మీ, ఎన్టీఆర్ జిల్లా ఉపసంచాలకులు ఎం.రమాదేవి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గాన అమరావతి వెళ్లారు.



కేంద్రమంత్రి రామ్‌దాస్‌తో ఎమ్మెల్యే వెంకట్రావు



అలరించిన గీతా మాధురి లైవ్ మ్యూజిక్

గొల్లపూడి : గొల్లపూడిలోని ఎగ్జిబిషన్‌లో ఆదివారం రాత్రి ప్రముఖ సింగర్ గీతా మాధురి లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. హనుమాన్‌తో కలిసి గీతా మాధురి పాడిన 'రాను బొంబాయికి.. రాను.. పాట ప్రేక్షకులను ఒక ఊపు ఊపింది. 'నేను పక్కా లోకల్, నేను పక్కా లోకల్, టాప్ లేచిపోద్ది టాప్ లేచిపోద్ది, డార్లింగే డార్లింగే ఒసినా డార్లింగే' పాటలతో ప్రేక్షకులను అలరించారు.

హుండీలపైనే ఆశలు!

» దసరా ఉత్సవ ఖర్చు రూ. 15 కోట్లు

» ఈ ఏడాది టిక్కెట్ల రూపంలో రూ. కోటి ఆదాయం కోల్పోయిన దేవస్థానం

» నేటి నుంచి దుర్గగుడి హుండీల ఆదాయం లెక్కింపు

» గతేడాది ఖర్చు రూ.13 కోట్లు.. రూ.10.50 కోట్లు ఆదాయం



దుర్గగుడిలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవస్థానం దుర్గామలేశ్వరస్వామి ఆలయానికి ఈసారి దసరా ఉత్సవాలు ఆదాయార్జనలో కాస్త నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. గతేడాది కంటే అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో.. సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తీసుకున్న నిర్ణయాలతో టికెట్ల ఆదాయంలో భారీ కోత పడింది. గతేడాది టిక్కెట్ల ద్వారా రూ.6.50 కోట్లు రాగా.. ఈ ఏడాది రూ.5.50 కోట్లు ఆదాయం వచ్చింది. ఈసారి రూ. 10 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అధికారుల అంచనా. సోమవారం నుంచి మూడురోజుల పాటు హుండీల ఆదాయం లెక్కింపుపైనే దేవస్థాన అధికారులు ఆశలు పెట్టుకున్నారు.

దసరా ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాల నుంచి డబ్బులు రావటం లేదు. అమ్మకు ఉత్సవాలలో వచ్చే ఆదాయంతోనే దసరా ఏర్పాట్లు చేస్తుంటారు. గతేడాది హుండీల ద్వారా రూ. 4 కోట్లు.. మొత్తంగా రూ.10.50 కోట్ల ఆదాయం రాగా.. ఖర్చులు రూ.13 కోట్లు అయ్యాయి. ఈ ఏడాది రూ. 15 కోట్ల మేర దేవస్థాన అధికారులు ఏర్పాట్లకు ఖర్చు పెట్టారు. సామాన్య భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దసరా ఉత్సవాలకు ముందే రూ.500 టిక్కెట్ దర్శనాలను రద్దుచేశారు. ఈ దసరా ఉత్సవాలకు అశేషంగా భక్తులు తరలివచ్చారు. ఒక్క రోజు తప్పితే మిగిలిన అన్ని రోజులూ లక్షకు తగ్గకుండా కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి వచ్చారు. సామాన్యభక్తులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి వీలుగా టిక్కెట్లను రద్దుచేసి అందరికీ ఉచితంగా దర్శన అకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ఇంద్రకీలాద్రిపై లెక్కించే హుండీలపై దేవస్థాన అధికారులు ఆశలు పెట్టుకున్నారు. భక్తుల తాకిడి కారణంగా క్యూలలో రద్దీని నివారించటానికి పోలీసులు భక్తులు ఆగి హుండీలలో డబ్బులు వేసే సమయం కూడా ఇవ్వలేదు. దీంతో చాలామంది భక్తులు హుండీలలో కానుకలు వేయలేకపోయారని తెలుస్తోంది. ఇదే జరిగితే రూ. 3 నుంచి రూ. 5 కోట్ల వరకు దేవస్థానం భరించే పరిస్థితి ఏర్పడబోతోంది.

లడ్డూ విక్రయాలు ఆదాయంగా పరిగణించలేం



దసరాలో ఉత్సవాల్లో కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదాల విక్రయాలకు సంబంధించి ఆదాయంగా పరిగణించే పరిస్థితి లేదు. కేజీ లడ్డూ తయారీకి నాణ్యమైన సరుకులను ఉపయోగిస్తున్న కారణంగా రూ. 800 నుంచి రూ. 1000 వరకు ఖర్చు అవుతోంది. పరిమాణం రీత్యా 80 గ్రాముల లడ్డూను అందిస్తున్నారు. కేజీ లడ్డూలను అధికారులు కేవలం రూ.400లకే విక్రయిస్తున్నారు. దీంతో ఈసారి భారీ సంఖ్యలో లడ్డూల విక్రయాలు జరిగాయి. లడ్డూల విక్రయాల ద్వారా ఆదాయం వచ్చినా.. దానికి అయ్యే ఖర్చు ఇంకా పెరుగుతుందనేది తెలిసిందే..

14 రోజుల్లో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు 20 లక్షలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా ఉత్సవాలతో పాటు ఈనెల 5వ తేదీ రాత్రి వరకు మొత్తం 20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఈవో వీకే శీనానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 22 నుంచి దుర్గమ్మ వారిని 11 రోజుల పాటు 15,90,400 మంది భక్తులు దర్శించుకున్నారని ఈవో వివరించారు. ఉత్సవాల అనంతరం 3వ తేదీన 1,47,590 మంది, 4వ తేదీన 1,38,360 మంది, 5వ తేదీ రాత్రి వరకు మొత్తం కలిపి 20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

క్యూలైన్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత...

ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి దేవస్థానం అధికారులు క్యూలో కాలినడకన అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అంతరాయం కలగకుండా భద్రత నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. భక్తులను గాలిగోపురం నుంచి నేరుగా ఘాట్ రోడ్డులోకి అనుమతించారు. ఆదివారం కూడా అధికారులు ఘాట్ రోడ్డులోకి వాహనాలను నిలిపివేశారు. కేవలం వీఐపీ వాహనాలను మాత్రమే కొండపైకి అనుమతించారు.

నేటి నుంచి ఘాట్‌రోడ్డులోకి వాహనాల అనుమతి

దుర్గగుడిలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని రెండు రోజుల ముందు నుంచి ఘాట్ రోడ్డుపై వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. కేవలం కమిటీ చైర్మన్, కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబులు ఇచ్చిన పాస్‌లు ఉన్న వాహనాలను మాత్రమే అనుమతించారు. సోమవారం నుంచి ఘాట్ రోడ్డులోకి యథావిధిగా వాహనాలను అనుమతించనున్నట్టు అధికారులు తెలిపారు.

ఇంద్రకీలాద్రికి భవానీల తాకిడి..

» ఆదివారం పెరిగిన రద్దీ.. నేటి నుంచి తగ్గనున్న భక్తులు



రద్దీగా క్యూ లైన్లు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీ భక్తుల తాకిడి కొనసాగుతోంది. దసరా మహోత్సవాలు ముగిసిన తరువాత కూడా భవానీదీక్షాధారులు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి 68,540 మంది భక్తులు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. మరోవైపు దసరా సెలవులు ముగియనుండటంతో కుటుంబాలతో సహా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భక్తులకు మంచినీరు, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం, తరువాత 10 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతోంది. ఈవో వీకే శీనానాయక్, ధర్మకర్తల మండలి చైర్మన్ రాధాకృష్ణ (గాంధీ) భక్తుల సౌకర్యాలపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. సోమవారం నుంచి పనిదినాలు ప్రారంభం కానుండటంతో భక్తుల రాక తగ్గుతుందని భావిస్తున్నారు. దేవస్థానం సిబ్బంది, పోలీస్, రెవెన్యూ, నగరపాలక సంస్థ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తిస్తున్నారని ఈవో శీనానాయక్ తెలిపారు.



అమ్మను దర్శించుకుంటున్న భవానీలు

భవానీ భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు : ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి : దసరా మహోత్సవాల అనంతరం అమ్మవారి దర్శనానికి పెద్దఎత్తున తరలివస్తున్న భవానీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈవో వీకే శీనానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన కనకదుర్గానగర్‌లోని ప్రసాదాల కౌంటర్లు, అన్నదాన విభాగం, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కనకదుర్గానగర్‌లోని ప్రసాదాల కౌంటర్లను పరిశీలించిన ఆయన లడ్డూల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అన్నదాన విభాగాన్ని పరిశీలించి భక్తులతో నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.



అనతరం ఘాట్ రోడ్డులో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. క్యూలలో భక్తులకు మంచినీరు, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ జరుగుతూనే ఉండాలని అధికారులకు సూచించారు. సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయా విభాగాల అధికారులను ఈవో ఆదేశించారు.

భవానీపురంలో కలకలం రేపిన హత్య

» భార్యను దూరం చేసిందని వృద్ధురాలి దారుణ హత్య

» పోలీసుల అదుపులో నిందితులు

» హత్య కేసు నమోదు




విజయలక్ష్మి హత్య జరిగిన ఇల్లు ఇదే..

విద్యాధరపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భవానీపురంలో వృద్ధురాలి దారుణహత్య స్థానికంగా కలకలం రేపింది. వృద్ధురాలు మ్యారేజీ బ్యూరో నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. నిందితుడు ఆమె సోదరి కొడుకు వంకధార హనుమాన్‌జీ సుబ్రహ్మణ్యంగా పోలీసులు నిర్ధారించారు. హత్యపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. తన భార్య ఓ రౌడీషీటర్‌తో వెళ్లిపోవటానికి కారణం పిన్ని వరసైన విజయలక్ష్మి అని కక్ష పెంచుకున్న నిందితుడు ఆమెను అతి కిరాతకంగా హత్యచేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీపురం హెచ్‌బి కాలనీ ఎంఐజీ 1, బ్లాక్ నెం.21, ప్లాట్ నెం.1లో (కుండల బజార్) వంకధార హనుమాన్‌జీ సుబ్రహ్మణ్యం భార్య, కుమారుడితో కలిసి ఉంటు.. టైలరింగ్ పనులతో పాటు ఓ షాపులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అతడి భార్య ఓ రౌడీషీటర్‌తో సన్నిహితంగా ఉంటూ మూడేళ్ల క్రితం భర్తనుంచి విడిపోయి కుమారుడితో వెళ్లిపోయినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవానీపురం ఊర్మిళానగర్ చివరి రోడ్డులో ఉంటున్న పిన్నివరసైన పొత్తూరి విజయలక్ష్మి (60) ప్రోత్సాహంతోనే తన భార్య వెళ్లిపోయిందనే కోపంతో నిందితుడు సుబ్రహ్మణ్యం ఆమెపై పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఏడాదిన్నర క్రితం రౌడీషీటర్ చనిపోవడంతో కుమారుడు తల్లి నుంచి సుబ్రహ్మణ్యం వద్దకు వచ్చేశాడు. అప్పటి నుంచి సుబ్రహ్మణ్యం కొడుకును చదివించుకుంటున్నాడు. ఇదిలా ఉండగా తన భార్య వెళ్లిపోవటానికి కారణమైన పిన్ని విజయలక్ష్మి హత్యకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. దీనిలో భాగంగా ఈనెల 1న సుబ్రహ్మణ్యం కుమారుడు బైక్‌పై విజయలక్ష్మిని హెచ్‌బి కాలనీలోని తనఇంటికి తీసుకువచ్చాడు. అప్పటికే ఇంట్లో సిద్ధంగా సుబ్రహ్మణ్యం పథకం ప్రకారం ఆమెను పదునైన ఆయుధాలతో హత్యచేసి శరీర భాగాలను వేరు చేశాడు. చేతులు, తల, మొండెం, కాళ్ల భాగాలను రెండు గోనె సంచుల్లో కట్టి అర్ధరాత్రి బైక్‌పై విజయవాడ రూరల్ గొల్లపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని బొమ్మసానినగర్‌లో డ్రైనేజీ కాలువలో ఓ సంచిని పడేశాడు. తరువాత అట్కిన్‌సన్ స్కూల్ రోడ్డులోని డ్రైనేజీ కాలువలో మరో గోనె సంచిని పడవేశాడు. ఇంటికి తాళాలు వేసి కుమారుడితో కలిసి నంద్యాల వెళ్లిపోయాడు. అయితే విజయలక్ష్మి కనిపించటం లేదని ఆమె బంధువు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విజయలక్ష్మి హత్య ఉదంతం స్థానికంగా చర్చనీయాంశమైంది. సుబ్రహ్మణ్యం కుమారుడు భవానీపురంలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా నిందితులను గుర్తించి వారు నంద్యాలలో ఉన్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకుని విజయవాడ తరలించి విచారిస్తున్నారు. నిందితుడు కుండలబజార్‌లో బంధువుల ప్లాట్‌లో అద్దెకు ఉంటున్నట్టు స్థానికులు చెబుతున్నారు. పొత్తూరి విజయలక్ష్మి హత్యపై ఆదివారం ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఊర్మిళానగర్‌లో విజయలక్ష్మి కుమారుడు రవిశేఖర్‌తో కలిసి ఉంటోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్ఆర్ బార్ సీజ్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో ఉన్న ఏఎన్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌ను సీజ్ చేసినట్టు భవానీపురం ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ ఆదివారం రాత్రి తెలిపారు. అన్నమయ్య జిల్లా ములకల చెరువు నకిలీ మద్యం కేసులో ఉన్న అద్దేపల్లి జనార్దన్ పేరుతో ఉన్న ఏఎన్ఆర్ బార్‌ను సీజ్ చేశామన్నారు. స్టాక్‌ను తనిఖీ చేశామని, ఇక్కడ మద్యం ఏం లభించలేదని సీఐ తెలిపారు. అక్కడి కేసులో ఇబ్రహీంపట్నంకు చెందిన జనార్దన్ ఏ1 ముద్దాయిగా ఉన్నట్టు సీఐ తెలిపారు.



సీజ్‌చేసిన ఏఎన్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్

నయా వాణిజ్య దందా!

(3వ పేజీ తరువాయి)

రవాణా వాహనదారులను అడుగుతారో వారు తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత నుంచి డ్రైవర్లు రాత్రి సమయాల్లో అధికారుల అవతారం ఎత్తుతున్నారు. సాధారణంగా సీవీటీలకు సంబంధించి ఒక సర్కిల్ పరిధిలోని అధికారులను మరో సర్కిల్‌లోకి పంపుతారు. దీన్ని గమనించిన డ్రైవర్లు తమకు నచ్చిన సర్కిళ్లలోకి వెళ్లి తనిఖీలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కార్యాలయం పనివేళలు ముగిసిన తర్వాత అధికారులను వారి ఇళ్ల వద్ద వదిలిపెట్టి వాహనాలను అక్కడే విడిచిపెట్టాలి. డ్రైవర్లు ఆ విధంగా చేయడం లేదు. అధికారులను ఇళ్ల వద్ద దింపేసిన తర్వాత కారులను తీసుకుని వెళ్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ కారులను తీసుకుని సీవీటీలకు వెళ్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు డ్రైవర్లు ఈవిధంగా చేసినట్టు ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. అధికారులు కారుల్లో ఉన్నారని వ్యాపారులను బెదిరించి వేలాది రూపాయలను వసూలు చేసినట్టు ఆరోపణలు బలంగా ఉన్నాయి.

రైల్వేలో దసరా జోష్!

(3వ పేజీ తరువాయి)

ప్రయాణికులకు ఎక్కడా సమస్యలు రాకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్‌తో పాటు డివిజన్ పరిధిలోని ప్రధాన స్టేషన్లలో కూడా 25 అదనపు బుకింగ్, రిజర్వేషన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా మొత్తం 72 ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ (ఏటీవీఎం)లను ప్రారంభించారు. వీటి ద్వారా భారీగా టికెట్ల విక్రయాలు జరిగాయి. ఏటీవీఎంలు 24 గంటల పాటు పనిచేసేలా మొత్తం 110 మంది ఫెసిలిటేటర్లను రైల్వే అధికారులు నియమించారు. ఫలితంగా రికార్డు స్థాయిలో ప్రయాణికులు వచ్చినా కూడా ఎక్కడా ప్రయాణికులకు ఇబ్బందులనేవి తలెత్తకుండా సాఫీగా నడిచింది. విజయవాడ డివిజన్ దక్షిణ మధ్యరైల్వే పరిధిలోనే రికార్డు స్థాయిలో ఆదాయం సాధించటంపై డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) మోహిత్ సోనాకియా అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషిని అభినందించారు.

కరిగిపోతున్న ద్వీపం

(3వ పేజీ తరువాయి)

చూస్తే ఇప్పటికి 10 సార్లకుపైగా కృష్ణానదికి వరద వచ్చింది. దసరాకు ముందు ఏడు లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. తరచూ వస్తున్న వరదల కారణంగా భవానీ ద్వీపం కొట్టుకుపోతోంది. ఇప్పటికే 13 ఎకరాలు కొట్టుకుపోయిన నేపథ్యంలో, రానున్న రోజుల్లో భారీ వరదలు వస్తే ఇదే వాలుగా ద్వీపం మరింత తరిగిపోయే ప్రమాదం ఉంది. రానున్న కాలంలో భవానీ ద్వీపం మనుగడకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది.

రూ. కోట్లు వరద పాలు

పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు రెండు దశాబ్దాలుగా భవానీ ద్వీపంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాయి. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రగా ఏర్పడిన క్రమంలో అమరావతి రాజధానికి చెంతనే ఉండటం వల్ల ప్రభుత్వం భవానీ ద్వీపానికి పెద్దపీట వేసింది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. 2024లో వచ్చిన వరదల కారణంగా ద్వీపంలో చేపట్టిన అభివృద్ధి అంతా కూడా వరదకు కొట్టుకుపోయింది. ఆ ఏడాది రూ.5 కోట్ల మేర నష్టం వాటిల్లింది. 2016-17 మధ్య కాలంలో కృష్ణానదిలో ప్రభుత్వం రూ.12 కోట్ల వ్యయంతో ఆసియా దేశాలలోనే అత్యంత భారీగా మ్యూజికల్ అండ్ ఫ్లోటింగ్ లేజర్ షోను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వచ్చిన వరదల కారణంగా ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెయిన్ అండ్ లేజర్ షో కొట్టుకుపోయింది. దీనికి ఇన్సూరెన్స్ చేసినా ఇప్పటికీ ఆ డబ్బులు రాలేదు. భవానీ ద్వీపంలో ప్రతిదానికి ఇన్సూరెన్స్ చేసినా.. వరదల వల్ల సంభవించిన నష్టాలలో గోరంత సాయం మాత్రమే వచ్చింది. ఇప్పటి వరకు భవానీ ద్వీపంలో వరదల కారణంగా రూ. 30 కోట్ల మేర పెట్టిన పెట్టుబడులకు నష్టం జరిగింది.

అటకెక్కిన బాలల బీమా!

(3వ పేజీ తరువాయి)

కోసం విద్యార్థి నుంచి పాఠశాల ప్రారంభంలో నగదు వసూలు చేసేవారు. 2014 రాష్ట్ర విభజన అనంతరం ఈ పథకం ఊసేలేదు. ఏడాదికి అతి తక్కువ ప్రీమియంతో ప్రమాదాల్లో క్షతగాత్రులైన, మరణించిన చిన్నారులకు, వారి కుటుంబాలకు ఈ పథకం ఆర్థిక ఆసరా కల్పించేది.

ఏడాదికి రూ.5 చెల్లిస్తే..

ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థుల నుంచి బీమా పథకంలో ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.5 చొప్పున వసూలు చేసేవారు. సదరు మొత్తాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల ప్రారంభంలో విద్యార్థుల నుంచి వసూలు చేయడం లేదా ఈ మొత్తాన్ని దాతల నుంచి సమకూర్చడం చేసేవారు. అలా వసూలు చేసిన నగదును జిల్లా అధికారులకు చెల్లించేవారు. జిల్లా అధికారులు బీమా సంస్థకు పంపేవారు. విద్యార్థి ప్రమాదానికి గురైన లేదా సహజంగా మరణించినా రూ.లక్ష పరిహారాన్ని బీమా సంస్థ చెల్లించేది. ప్రమాదంలో అంగవైకల్యం సంభవిస్తే ప్రమాదపు తీవ్రత ఆధారంగా రూ.75 వేలు, గాయపడితే రూ.25 వేల నుంచి రూ.50వేల వరకు బీమా పరిహారం బాధిత కుటుంబాలకు అందేది.

విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టి సారించాలి

ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు బాలల బీమా పథకం ఎంతో ప్రయోజనకరం. 11 ఏళ్ళుగా అటకెక్కిన ఈ పథకంపై విద్యాశాఖ అధికారుల వద్ద ఎటువంటి సమాచారం లేదు. కొందరు అధికారులైతే అసలు ఇటువంటి పథకం ఉందా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నుంచి 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు వరం లాంటి బాలల బీమా పథకాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ పునరుద్ధరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

11 నుంచి ఆక్యుపంక్చర్ చికిత్సపై శిక్షణ

కానూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కానూరు అశోక్ నగర్‌లోని ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయంలో ఆక్యుపంక్చర్ చికిత్స విధానంపై ఈ నెల 11నుంచి 17వ తేదీ వరకు వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయం చైర్మన్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ మకాల సత్యనారాయణ చెప్పారు. ఆదివారం ఆయన కానూరులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, భారత ప్రభుత్వ ప్రోత్సాహంతో, భారత్ సేవక్ సమాజ్(బీఎస్ఎస్) సమన్వయంతో ఈకార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ శిక్షణలో స్వీయ, కుటుంబ ఆరోగ్య బహుల చికిత్సలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ మేరకు ఏపీ ఖాదీ బోర్డుతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నామని చెప్పారు. మరిన్ని వివరాలకు 9000347369 సెల్ నెంబరును సంప్రదించాలని డాక్టర్ సత్యనారాయణ కోరారు.

మాజీ ప్రధానులకు సముచిత గౌరవం

● విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయింపు

గన్నవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని, మాజీ ప్రధానులకు సముచిత గౌరవం ఇస్తుందని, వారి విగ్రహాలు నిర్మించేందుకు 1.5 సెంట్లు స్థలం కేటాయించినట్లు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఆదివారం ఏపీసీసీ సభ్యులు ధనేకుల మురళీ మోహన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గొల్లు కృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఝాన్సీ రాణి, గోగులమూడి రవీంద్రలకు మాజీ ప్రధానుల విగ్రహాల ఏర్పాటుకు భూకేటాయింపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గాంధీబొమ్మ సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకూ రహదారి సుందరీకరణ అభి వృద్ధిలో భాగంగా మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను తొలగించాల్సి వచ్చిందని తెలిపారు. దానిలో భాగంగా ఈ మూడు విగ్రహాలను బాలుర ఉన్నత పాఠశాల గేటు పక్కన ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పా రు. గ్రానైట్ దిమ్మల నిర్మాణం నిమిత్తం గ్రామపంచాయతీ నుంచి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.



కాంగ్రెస్ నాయకులకు భూ కేటాయింపు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

శ్రీనివాస్‌రెడ్డి లేని లోటు తీరనిది

ప్రసాదంపాడు : గత ఎనిమిది ఏళ్లుగా తన వెంట నడిచిన గుంటక శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మిక మరణం తనను ఎంతగానో కలిచి వేసిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఆదివారం విజయవాడ రూరల్ మండలం గూడవల్లి గ్రామంలోని శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు రోజుల క్రితం గుండె పోటుతో శ్రీనివాస్‌రెడ్డి మరణించారన్నారు. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రసాదంపాడు మాజీ సర్పంచ్ బొప్పన హరికృష్ణ మాతృమూర్తి బొప్పన రాజేశ్వరి పెద్దకర్మకు హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ గూడవల్లి గ్రామ అధ్యక్షులు జొన్నలగడ్డ శ్రీను, తెలుగు యువత నాయకులు నాయకులు సొంగా సంతోష్, నెరసు శ్రీకాంత్, సొంగా శశి, కొల్లిపర ధనరాజ్, సొంగా సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ

కంకిపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య సిబ్బందికి అవసరమైన దుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని సర్పంచ్ బాకి రమణ అన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బాకి రమణ, ఉప సర్పంచ్

కంకిపాడులో పారిశుధ్య సిబ్బంది 72 మందికి ఆదివారం ఆమె దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఈవో రాజేంద్ర వరప్రసాద్, సూర్య, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



శతాధిక వృద్ధురాలికి సత్కారం

ఉయ్యూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బోళ్లపాడుకు చెందిన నూరు సంవత్సరాలు పూర్తిచేసుకున్న వృద్ధురాలు కొండా మంగమ్మను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కలసి ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇప్పటికి సంపూర్ణ ఆరోగ్యవంతురాలుగా జీవిస్తున్న మంగమ్మ నిత్యజీవితంలో తన పనులు తాను చేసుకుంటూ ఉండటం విశేషమని, మరిన్ని సంవత్సరాలు ఆరోగ్యవంతురాలిగా జీవించాలని పలువురు ఆకాంక్షించారు. భీమవరపు కోటిరెడ్డి, ఎంపీటీసీ టి. గంగారత్నం, సంజీవరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మంగమ్మ కుటుంబ సభ్యులు పాల్గొని సత్కరించారు.

అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆర్‌ఎస్‌ఎస్

ప్రముఖ న్యాయవాది కలపాల వెంకటరమణ

గన్నవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించిందని ప్రముఖ సీనియర్ న్యాయవాది కలపాల వెంకటరమణ అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం విజయదశమి శతాబ్ది ఉత్సవ సభ గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షులు కెహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది వెంకటరమణ మాట్లాడుతూ, దేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఆర్‌ఎస్‌ఎస్ చేరడం గొప్ప విషయమన్నారు. విద్యాభారతి ప్రాంత కార్యదర్శి ప్రతాపసింహ శాస్త్రి, పూర్ణచంద్రరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, ఎం.వేణుగోపాల్, రామసేతు, శ్రీనాథ్, యెడవల్లి పాండు రంగారావు, నాదెండ్ల మనోహర్, కానూరు శేషు మాధవి పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ ఊరేగింపు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక హనుమాన్‌నగర్‌లోని సయ్యద్ తాజ్ ఉద్దీన్‌బాబా ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ అక్బర్ షరీఫ్ (బాబా) ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో గ్యార్మీ పండుగను ఘనంగా నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో కలిసి జంక్షన్ నాలుగు రోడ్లలో డప్పు వాయిద్యాల మధ్య పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు.

దేవాలయ సిబ్బందికి అండగా దేవినేని ఆర్మీ

కంకిపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవినేని ఆర్మీ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. ఈడుపుగల్లులోని దేవాలయాల్లో పనిచేసే సిబ్బందికి లయన్, ప్రొఫెసర్ రావి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం దుస్తులు, నిత్యావసరాలు, నగదు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేవినేని రాజా మాట్లాడుతూ, లయన్స్‌క్లబ్‌తో పాటు దేవినేని ఆర్మీ సంయుక్తంగా చేపడుతున్న సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. సర్పంచ్ పందిపాటి ఇందిర, షేక్ షకార్, నందమూరి మాధవ, నాగేశ్వరరావు, సాంబయ్య, కొల్లిపర వెంకటేశ్వరరావు, మారెళ్ల సాంబయ్య, మాణిక్యాలరావు, కొమ్మారెడ్డి రాము, శ్యామ్, గుర్రం నరసింహారావు, లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ సభ్యులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు

ఉంగుటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 పన్నుల తగ్గింపు సంస్కరణలతో రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ అన్నారు. జీఎస్టీ 2.0పన్ను తగ్గింపుపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉంగుటూరులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఏవో గద్దె రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో జేవీఎస్ఆర్‌కే ప్రసాద్, ఎంఈవో-2 జె.సాంబశివరావు, ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, ఏపీఎం ఎన్.సాంబశివరావు, ఏపీవో టి.వినీల, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, కొలుసు రవీంద్రబాబు, దాసరి నాగేంద్రబాబు, కాటూరి వరప్రసాద్, రైతులు, అధికారులు పాల్గొన్నారు.



ఉంగుటూరులో జీఎస్టీపై అవగాహనా ర్యాలీ



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కడవకొల్లులో ఇంటింటా ప్రచారం చేస్తున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఉయ్యూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం ధ్యేయంగా కూటమిప్రభుత్వం పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతుందని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. కడవకొల్లులో ఆదివారం పర్యటించి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యాక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు వేమూరి విజయ్ కుమార్, సీనియర్ నాయకులు వేమూరు శ్రీనివాసరావు, కుప్పాల అంజిబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన నేతలకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కిలారు దిలీప్, ఇతర నాయకులు

బీజేపీలో పలువురి చేరిక

పెనమలూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నుంచి బీజేపీలోకి వివిధ పార్టీల నాయకుల చేరారు. బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్చార్జి, సీనియర్ నాయకులు కిలారు దిలీప్ స్వగృహంలో ఆదివారం నియోజకవర్గానికి చెందిన తాళ్ల నరేంద్ర, షేక్ చిన్నాల ఆధ్వర్యంలో వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ కృష్ణాజిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరాం మాట్లాడుతూ, బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులయిన పలువురు నేతలు పార్టీలో చేరుతున్నారని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ బాషా, సీనియర్ నాయకులు వల్లూరి శ్రీమన్నారాయణ, దుర్గాప్రసాద్, మోర్ల మహీధర్, మరీదు రమేష్ పాల్గొన్నారు.

తోపుడు బళ్లు అందజేత

పెనమలూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పోరంకి టీడీపీ కార్యాలయంలో యువనేత బోడె వెంకట్రాం ఆదివారం ఇద్దరు నిరుపేదలకు తోపుడు బళ్లను అందజేశారు. కంకిపాడుకు చెందిన కొండేటి సత్యనారాయణ, వేల్పూరు గ్రామాలకు చెందిన వక్కలగడ్డ పూర్ణచంద్రరావులకు జీవనోపాధి నిమిత్తం సదరు బళ్లను అందజేసినట్లు వెంకట్రామ్ తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

ఉయ్యూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అన్నదానం చేయడం ద్వారా పేదల ఆకలి తీర్చడం ఎంతో సంతృప్తినిస్తుందని వాసవీ క్లబ్ బాధ్యుడు వూర కిషోర్‌కుమార్ అన్నారు. గురజాడ డొంక పక్కన నివసించే ఎస్టీ వర్గానికి చెందిన వంద మందికి మధుతలీస్ చారిటీ ద్వారా ఆదివారం ఆహార పొట్లాలు కిషోర్ కుమార్ అందజేశారు. పాలడుగు శ్రీరామ్, సాయి రాఘవ, ఎన్‌సీసీ క్యాడెట్లు సేవలందించారు.



ఎంపీ కేశినేని శివనాథ్ నుంచి అవార్డు అందుకుంటున్న మైథిలి

విజయవాడ ఉత్సవ్‌లో మైథిలీకి అవార్డు

ఉయ్యూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఉత్సవ్‌లో క్లాసికల్ డ్యాన్స్, క్లాసిక్ ఫ్రీస్టైల్ డ్యాన్స్‌లో గండిగుంటకు చెందిన మైథిలి ప్రథమ బహుమతి సాధించింది. 2500 మంది పాల్గొన్న పోటీల్లో చివరకు ఆరుగురు మిగలగా వారిలో విశేష ప్రతిభ కనపరచిన మైథిలి విజయవాడ ఐడల్ రన్నర్ ఆఫ్ అవార్డు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత, పట్టాభి అవార్డు అందజేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అభినందించారు.



వైద్యశిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న అనుమోలు ప్రభాకరరావు, చెన్నుపాటి శ్రీనివాస్

250 మందికి వైద్య పరీక్షలు

పెనమలూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పోరంకి టీడీపీ కార్యాలయంలో అనుమోలు ఆదరణ ట్రస్టు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరానికి 250మందికి పైగా స్థానికులు హాజరై బీపీ, షుగరు తదితర వైద్య పరీక్షలను చేయించుకొని ఉచితంగా మందులను పొందారు. ఈ సందర్భంగా అనుమోలు ఆదరణ ట్రస్టు చైర్మన్ అనుమోలు ప్రభాకరరావు మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా తాను ట్రస్టు తరపున చేపట్టిన ఉచిత వైద్య సేవలకు విశేష గుర్తింపు లభించినందుకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్యాపిటల్ ఆసుపత్రి వైద్యులు, చెన్నుపాటి శ్రీనివాస్, బొంగరాల అబ్రహాం తదితరులు హాజరయ్యారు.



బోనస్ అందజేస్తున్న విజయ డెయిరీ జనరల్ మేనేజర్ డాక్టర్ పారీ

పశువులకు బీమా చేయించాలి

గన్నవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు తమ పశువులకు తప్పనిసారిగా బీమా చేయించుకోవాలని కృష్ణామిల్క్ యూనియన్ జనరల్ మేనేజర్ డాక్టర్ పారీ సూచించారు. మండలంలోని దావాజీగూడెంలోని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘంలో శనివారం పాడి రైతులకు రూ. 5.54 లక్షల బోనస్‌ను సంఘ అధ్యక్షులు గొంది నరేంద్రతో పాటు అందజేశారు. 2024-25 ఏడాదిలో సంఘం సాధించిన రూ. 9.90 లక్షల నికరలాభంలో 70శాతం వాటాను 140 మంది పాడి రైతులకు బోనస్‌గా అందజేసినట్లు క్లస్టర్ మేనేజర్ తుమ్మల యశ్వంత్ తెలిపారు. అనంతరం అత్యధిక పాల ఉత్పత్తిదారులైన పాడిరైతులకు వెండి, మిక్సీలను బహుమతిగా అందజేశారు. రూట్ సూపర్‌వైజర్‌లు పి.రాజీవ్, అంజనేయులు, వేతన కార్యదర్శి వీ.నాగరాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాల్వలో పడి యువకుడి గల్లంతు

పెనమలూరు, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): యనమలకుదురు కాల్వలో ప్రమాదవశాత్తూ జారి పడి వ్యక్తి గల్లంతయిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యనమలకుదురుకు చెందిన ఉద్దగిరి వెంకటేశ్వరరావు (20) శనివారం పని నుంచి తిరిగి వచ్చి గ్రామ పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని వంతెనపై కూర్చొని ఉండగా చేయి జారి ప్రమాదవశాత్తూ కాల్వలో పడిపోయాడు. ఇది తెలుసుకొన్న అతడి బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని వెతికారు. ఎలాంటి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఇంతవరకు ఆచూకీ లభించలేదు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య

పెనమలూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప వందడుగుల రోడ్డులోని ఒక ప్రైవేటు కళాశాలలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఒక యువకుడు (25) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చందర్లపాడు గ్రామానికి చెందిన వడ్లమూడి పవన్‌తేజ గత కొన్నాళ్లుగా వందడుగుల రోడ్డులోని ఒక ప్రైవేటు కళాశాలలో పనిచేస్తూ క్యాంపస్ వసతి గృహంలో ఉంటున్నాడు. శనివారం సాయంత్రం ఒక పురుగుమందు బాటిల్ ఫోటోను అతని బావకు వాట్సాప్‌లో పంపాడు. దీంతో అనుమానం వచ్చిన బంధువులు అతని గురించి వెతగ్గా వందడుగుల రోడ్డులోని పంట పొలాల్లో కనిపించాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా అతడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. యువకుని మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

7, 8 తేదీల్లో మండలస్థాయి ఆటల పోటీలు

ఉంగుటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో ఉంగుటూరు జడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం చోరగుడి అనిత తెలిపారు. బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, అథ్లెటిక్స్‌లో అండర్-14, 17 బాలురకు మంగళవారం, బాలికలకు బుధవారం పోటీలు జరుగుతాయన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఎంట్రీ ఫారమ్స్, ఎండీఎం అక్విటెన్స్, ఆధార్‌కార్డ్ జిరాక్స్ కాపీలను ఆయా పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు.

నేడు కౌతవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడ్లవల్లేరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కౌతవరం సబ్‌స్టేషన్ ఏఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. కౌతవరం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో 11 కేవీ లేన్లపై వాలుతున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. కౌతవరం, పద్మాలపాలెం, వేమవరం, వేమవరపుపాలెం, వడ్లమన్నాడు, భీమునిగుంట, రెడ్డిపాలెం, గాదేపూడి, ఉలవలపూడి గ్రామాల్లో గృహ వినియోగదారులు, వాణిజ్య, ఆక్వారంగ వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి సహకరించాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.



కొండాలమ్మ దర్శనానికి బారులుతీరిన భక్తులు

కొండాలమ్మ సన్నిధికి పోటెత్తిన భక్తులు

గుడ్లవల్లేరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారిని 30వేల మంది భక్తులు దర్శించుకొన్నారని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకొనేందుకు ఆలయానికి చేరుకొన్నారు. మహిళలు పాలపొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకొన్నారు. గుడివాడకు చెందిన భక్తులు రాజు సోని దంపతులు అమ్మవారికి రూ.24,000 విలువైన ముక్కుపుడకను నిర్వాహకులకు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



పామర్రు జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో పాల్గొన్న 1983-84లో టెన్త్ చదివిన విద్యార్థులు

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

పామర్రు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ హైస్కూల్లో 1983-84లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక గుడివాడ రోడ్డులోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. తాము విద్య నేర్చుకున్న పాఠశాలలో 41 ఏళ్ల కిందట చదువుకున్న రోజుల అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు కుటుంబ స్థితిగతులు, యోగక్షేమాలు, ప్రస్తుతం స్థిరపడిన ఉద్యోగ, వ్యాపార తదితర వివరాలను అప్యాయతగా పంచుకున్నారు. నాటి గురువులు ప్రోత్సాహంతో ఉద్యోగ, వ్యాపారరంగాల్లో రాణించామని గురువులను స్మరించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు అరగించారు. పూర్వవిద్యార్థులు ఘంటసాల త్రివిక్రమ సాయిరామ్, రాయవరపు వెంకటేశ్వరరావు, కొల్లి శ్రీనివాసరెడ్డి, బొంతు సుధాకర్, కేవీవీ లక్ష్మి, తోట అనురాధ, ఆర్ఎస్ఎన్ ప్రసాద్, రామారావు, జమీల్, అల్లంశెట్టి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు

గుడివాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం మేరకు బీసీల రిజర్వేషన్‌ల్లో ఏబీసీడీలుగా వర్గీకరణ చేశాక, జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికంగా ఉన్న బీసీలు రాజ్యాధికారానికి నోచుకోలేదని, వారికి న్యాయం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే లోపల కూటమి ప్రభుత్వం బీసీల రిజర్వేషన్‌లపై నిర్ణయం తీసుకోవాలని మల్లేశ్వరరావు కోరారు.



విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేనిని సత్కరిస్తున్న అప్సా ప్రతినిధులు

కొమ్మినేనికి గౌరవ పురస్కారం

గుడివాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యావికాస్ పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావును గౌరవ పురస్కారంతో సత్కరించారు. శనివారం రాత్రి పామర్రులో జరిగిన రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమొక్రాటిక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీరిని సత్కరించి, గౌరవ పురస్కారం అందజేశారు. అలాగే ఏలూరు జిల్లా, ముదినేపల్లిలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ అంబుల మనోజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి.. విద్యావికాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చాట్రగడ్డ నాగమల్లేశ్వరరావును ఘనంగా సత్కరించారు.



సీఎల్ వెంకట్రావు, హరిహరన్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

వైద్యులకు సన్మానం

గుడ్లవల్లేరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలకు పైగా పేదలకు ప్రతి నెల మొదటి శని, ఆదివారాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సీఎల్ వెంకట్రావును గ్రామస్థులు ఆదివారం సన్మానించారు. వెంకట్రావుకు సహకరిస్తూ ప్రతినెలా హైదరాబాద్ నుంచి వచ్చి గుడ్లవల్లేరులో మానసిక వ్యాధులకు చికిత్స అందిస్తున్న డాక్టర్ హరిహరన్‌ను కూడా గ్రామస్థులు, రోగులు అభినందిస్తూ సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, చాపరాల రాజేశ్వరరావు, వైపీసీ ప్రసాద్, అట్లూరి దిలీప్‌కుమార్, పాపయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

పమిడిముక్కల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గురజాడ డొంక ఊరచెరువు కట్ట గుడిసెలు వేసుకుని నివసించే వంద మందికి మధుతల్లీస్ చారిటీ ద్వారా ఆదివారం ఆహార పొట్లాలను కిషోర్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని ఆకలితో అలమటించే వారికి పట్టెడన్నం పెట్టి వారి ఆకలి తీర్చడం మానవత్వం అవుతుందన్నారు. పాలడుగు శ్రీరామ్, సాయిరాఘవ, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొని సేవలందించారు.

టిడ్కో కాలనీని సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



స్విచ్ ఆన్ చేసి బోర్‌వెల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల అనాలోచిత నిర్ణయాలతో అస్తవ్యస్తంగా తయారైన టిడ్కో కాలనీని అక్కడి నివాసితులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో రూ.40లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన 10 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన పవర్ బోర్‌వెల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రాధాన్యత క్రమంలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీరు ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. పది మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించామని, వారి సంఖ్యను భవిష్యత్తులో పెంచుతామన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతులకు ఆధునిక యంత్రాలతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం రూ.40లక్షల వ్యయంతో ఐదు బోర్‌వెల్స్ ఏర్పాటు చేశామని, మరిన్ని బోర్‌వెల్స్ ఏర్పాటుకు రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. కాలనీవాసులకు రెండు పూటలా మంచినీటిని సరఫరా చేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నేతలు జగన్మోహనరావు, నిరంజన్, లలిత, మున్సిపల్ ఎంఈ ప్రసాద్, డీఈ శివాజీ, స్థానికులు పాల్గొన్నారు.

గంగానమ్మ గుడిలో హుండీ చోరీ

గుడివాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక లింగవరం రోడ్డులోని గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీ పగలకొట్టి దొంగతనం జరిగినట్టు ఆలయ కమిటీ సభ్యులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. శనివారం దొంగతనం జరిగి ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

ప్రభుత్వ చేయూతతో ఆటోవాలాల హర్షం

పామర్రు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్లు కమ్ యజమానులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవ పథకాన్ని ప్రారంభించడంతో ఆటోవాలాలు ఆనందంతో పొంగిపోతున్నారు. స్త్రీ శక్తి పథకంతో ఆటోడ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్న తరుణంలో చంద్రబాబు ఎన్నికల సమయంలో ఆటోవాలకు ఇచ్చిన హామీని అమలు చేస్తారా లేదా? అనే అపనమ్మకంతో ఆర్థికఇబ్బందుల కష్టాలతో సతమతమవుతున్న ఆటోడ్రైవర్లకు రూ.15వేలు నగదును సీఎం బటన్ నొక్కి విడుదల చేసిన కొద్దిక్షణాల్లోనే వారి సెల్‌ఫోన్లకు వాహన మిత్ర పథకం ద్వారా బ్యాంకు ఖాతాకు జమ చేయడంతో నియోజకవర్గ కేంద్రంలో ఆటోడ్రైవర్ల ముఖాల్లో చంద్రకాంతులతో మెరిశాయి. పట్టరాని ఆనందంతో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన ఎన్నికల హామీని నేరవేర్చిన చంద్రబాబుతోపాటు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మనస్సు నిండా అభిమానంతో ధన్యవాదాలు ప్రకటించారు.

ప్రభుత్వం సాయం ఉపయోగం
షేక్ జానీబాషా, పెదమద్దాలి



ఉచిత బస్సు ప్రయాణం సర్వీసుతో ఆటోకి సరైన కిరాయిలు లేక సతమతమవుతున్న తరుణంలో ఆటోడ్రైవర్లకు చంద్రబాబు ప్రభుత్వం కల్పించిన రూ.15వేల ఆర్థిక సాయం ఎంతగానో ఉపయోగపడుతుంది.

చంద్రబాబు,పవన్‌కు రుణపడి ఉంటాం
సింగన్న, పామర్రు



ఆటోడ్రైవర్ల కష్టాలు గుర్తెరిగి రూ.15వేలు ఆర్థిక చేయూత అందిస్తామని చెప్పి అమలు చేసి తమ ఖాతాలకు జమచేసిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రుణపడి ఉంటాం.

ప్రభుత్వ నిబంధనలు పాటించండి
ఉయ్యూరు మోటారు ఇన్‌స్పెక్టర్ షేక్ అయేషా స్వాని



ప్రభుత్వం అందించిన ఆర్థిక చేయూతను ఆటో డ్రైవర్లు సద్వినియోగం చేసుకుంటూ ఆటోను పూర్తి కండిషన్‌లో ఉండేలా చూసుకుని, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఆటోలను నడుపుకోవాలి. ఎటువంటి అపరాధ రుసుం, వాహనంపై పెండింగ్ చలానాలు లేకుండా చూసుకోవాలి.



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో

ఉచిత వైద్యశిబిరం

గుడివాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డాక్టర్ తిపిర్నేని లక్ష్మీపెరుమాళ్లు, ప్రభావతి, చలసాని రాయన్‌చౌదరి జ్ఞాపకార్థం స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ఆర్థోపెడిక్ వైద్యులు, జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ అభిషేక్, డాక్టర్ సరిత, డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో వైద్య సేవలందించారు. క్లబ్ అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరరావు, కార్యదర్శి జీ కిరణ్‌బాబు, సభ్యులు బీ శంకర్రావు, డీ జ్యోతీశ్వరరావు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ చైతన్య, ఫార్మసీ అసిస్టెంట్ రాధిక, చంద్రశేఖర్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ప్లాస్టిక్ వ్యాపారి మృతి



గుడివాడ రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిళ్లపాడు రైల్వేగేటు సమీపంలో లారీ ఢీకొని ప్లాస్టిక్ సామగ్రి వ్యాపారి సూర్యారావు మృతి చెందారు. గుడివాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని డ్రో ణాదుల వారి వీధికి చెందిన లంకపల్లి సూర్యారావుకు బిళ్లపాడు శివారు చిన్న ఎరుకపాడులో ప్లాస్టిక్ సామగ్రి వ్యాపారం చేసేవారు. ఆదివారం మధ్యాహ్నం సుమా రు 2.30 గంటల సమయంలో ఏపీ 07డీ జీ 9213 నెంబరు గల స్కూటీపై వెళుతూ రైల్వేగేటు సమీపంలో రాగానే వెనుక నుంచి ఏపీ 16టీహెచ్ 7147 నెంబరు లారీ డ్రైవర్ అతివేగంగా వచ్చి స్కూటీని గుద్దాడు. దీంతో సూర్యారావును ఈడ్చుకుంటూ వెళ్లడంతో తీవ్ర రక్తగాయాలైన సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య లంకపల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎన్ చంటిబాబు తెలిపారు.

మరో ఘటనలో వ్యక్తికి గాయాలు

గుడివాడ: స్థానిక బైపాస్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగవరప్పాడుకు చెందిన నెరుసు రత్నశేఖర్ తన ద్విచక్రవాహనంపై పశువుల వద్దకు వెళుతున్నాడు. స్థానిక మిత్రా డయాగ్నోస్టిక్ సెంటర్ వద్ద లారీ రత్నశేఖర్‌ను ఢీకొట్టింది. గాయాలపాలైన రత్నశేఖర్‌ను స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



సుధాకర్‌కు పౌరసత్కారం చేస్తున్న గ్రామస్థులు

సమాజ శ్రేయస్సుకు యునైటెడ్ ఎన్జీవోస్ తొలి అడుగు

● రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

తోట్లవల్లూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సుకు తొలి అడుగు వేసేది ఎన్జీవోసేనని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు రాంబాబు పేర్కొన్నారు. చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెంకు చెందిన తూమాటి సుధాకర్ మాతృ యువజన సంక్షేమ సంఘం ద్వారా చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఢిల్లీలో భారత్ భవన్‌లో నేషనల్ యంగ్ కమ్యూనిటీ చాంపియన్ అవార్డుని నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్ అండ్ యాక్టివిస్టు (నిఫా) సంస్థ అధ్యక్షుడు ప్రీత్‌పాల్ సింగ్ చేతుల మీదుగా సెప్టెంబరు 22న అందుకున్నారు. ఈ సందర్భంగా తోట్లవల్లూరులో ఆదివారం సా యంత్రం సుధాకర్‌కు పౌరసన్మానం జరిగింది. రాంబాబు, కార్యదర్శి తాడితోటి నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్ తటుకూరి రమణ, మండల పాస్టర్ల అసోషియేషన్ అధ్యక్షుడు వల్లూరు చంద్రశేఖర్, బీసీ నేత లుక్కా వెంకట శ్రీనివాసరావు, కళ్లం ఫణిరెడ్డి, చైతన్య మహిళా మండలి అధ్యక్షురాలు వీ అచ్చమాంబ, సత్యనారాయణ, ఆకుల నాగరాజు సుధాకర్ దంపతులకు పౌర సత్కారం చేశారు.

పుట్టగొడుగుల్లా.. బెల్టుషాపులు

కూచిపూడి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలోని అన్ని గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో అనధికారిక మద్యం దుకాణాలు గ్రామానికి మూడు నుంచి ఆపైన 5, 6 దుకాణాలు ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. లైసెన్స్ పొందిన మద్యం దుకాణదారులు ఒక్కొక్క బెల్టుషాపు నిర్వాహకుడి నుంచి సగటున రూ.25వేల నుంచి రూ.50వేల వరకు డిపాజిట్‌గా వసూలు చేస్తున్నారు. మద్యం దుకాణదారులు సీసాకు రూ.10 అదనంగా వసూలు చేసి సరుకును నేరుగా దుకాణదారుల వద్దకు పంపే బాధ్యత తీసుకుంటున్నారు. విచ్చలవిడి బెల్టుషాపులతో గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుడి, బడి నివాస ప్రాంతాలనే వ్యత్యాసం లేకుండా ఏర్పాటు చేసిన బెల్టుషాపులను నియంత్రించి గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కోసూరులో అనధికార మద్యం దుకాణం



శ్రీనివాసరావుకు నియామక ఉత్తర్వులు అందిస్తున్న నరసింహారావు

మహాజన సోషలిస్టు పార్టీ నియోకవర్గ అధ్యక్షుడిగా శ్రీనివాస్

కూచిపూడి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మహాజన సోషలిస్టు పార్టీ పామర్రు నియోజకవర్గ అధ్యక్షుడిగా మొవ్వ మండలం చినముత్తేవి గ్రామానికి చెందిన మునిపల్లి శ్రీనివాస్‌ను నియమిస్తూ ఎమ్మార్పీఎస్ కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్ జలదంగి నరసింహారావు నియామక ఉత్తర్వులు అందజేశారు. అలాగే మొవ్వ మండలాధ్యక్షుడిగా శీలం రాంబాబును నియమించారు. ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నేతలు సిద్దెల జయరాజు, పసుమర్తి దినేష్, రాయవరపు చంద్రమౌళి పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం..

● పలువురికి గాయాలు
● విచ్చలవిడిగా తిరుగుతున్న గ్రామసింహాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

పెదపారుపూడి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అయ్య బాబోయ్ కుక్కలంటూ మండల ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలో కుక్కల బెడదతో మండల ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్లపై ద్విచక్రవాహనంతో ప్ర యాణించాలన్నా కుక్కలు ఎక్కడ వెంబడించి కరుస్తాయోనని భయం గుప్పిట్లో భీ తిల్లిపోతున్నారు. చిన్నా,పెద్దా తేడా లేకుండా శునకాల దాడికి వారంలో పదుల సంఖ్యలో శునకాల కాటుకి ఆసుపత్రి పాలవుతున్నారు.



గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతున్న శునకాలు

పంటబోదెలో గుర్తు తెలియని మృతదేహం

గుడివాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీ వద్ద పంటబోదెలో సుమారు 40-45ఏళ్ల మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. సదరు వ్యక్తి ఒంటిపై నలుపు రంగు ప్యాంటు, లేత ఆకుపచ్చ రంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, జేబులో తెలుపు రంగు చార్జర్ కలిగి ఉండి, కుళ్లిన దశలో శవం గుర్తుపట్టలేని విధంగా ఉందని రూరల్ ఎస్ఐ ఎన్ చంటిబాబు తెలిపారు. పంచామతీ కార్యదర్శి భట్రాజు కోటయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చంటిబాబు తెలిపారు.

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒక్కరోజు ఆదాయం రూ.9.55 లక్షలు



మోపిదేవి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం స్వామివారికి ఎంతో ప్రీతికరమైన రోజు కావటంతో వేలాదిగా భక్తులు విచ్చేసి పూజలు నిర్వహించారు. వివిధ సేవా రుసుముల ద్వారా ఒక్క రోజులోనే రూ.9,55,052 ఆదాయం వచ్చినట్లు ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయ ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

లక్ష్మీనృసింహ సోమయాజీ వైశ్య సమాజం ఆధ్వర్యంలో

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కన్యకా పరమేశ్వరీ దేవాలయం ఆవరణలో లక్ష్మీనృసింహ సోమయాజీ వైశ్య సమాజం ఆధ్వర్యంలో 79 మంది పేద విద్యార్థులకు రూ. లక్షా 50 వేల ఉపకార వేతనాలను బాలాజీ అందజేశారు. సంఘం అధ్యక్షుడు తాడేపల్లి మెహర్‌బాబా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి ఉడత్తు కిషోర్, కోశాధికారి కొప్పర్తి రవి, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి దేవాలయంలో వేదసభ



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పరాసుపేటలోని సువర్చలా సమేత ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి వేద పండితుల సభ అత్యంత వైభవంగా జరిగింది. పండితులు యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం పఠించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి టి.వి.వి. మోహనరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పెన్షనర్లు, అవార్డు గ్రహీతలకు విక్కుర్తి సత్కారం

అవనిగడ్డ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ చేసి విశ్రాంత జీవితం గడుపుతున్న వారి అనుభవాలు సమాజానికి ఎం తో అవసరమని పారిశ్రామిక వేత్త, విక్కుర్తి రాఘవయ్య ట్రస్ట్ చైర్మన్ విక్కుర్తి శ్రీనివాస్ అన్నారు. అవనిగడ్డ పెన్షనర్స్ భవనంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన చంద్రశేఖర్, ఉదయ్ కుమార్‌ల సేవలను అభినందించారు. పదవీ విరమణ చేసిన ఎస్‌బీబీవీవీ.ప్రసాద్, మద్ది వెంకటేశ్వరరావు, బి.సాంబశివరావు, బి.వెంకటేశ్వరరావు, నాగసు నీత, రాజేంద్ర ప్రసాద్, సనకా వెంకట స్వామి, లక్ష్మీనారాయణ, పూర్ణచంద్రరావు, సుబ్రహ్మణ్యం, పి.శేషయ్యలను ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రామకృష్ణ, అబ్దుల్ అజీజ్ పాల్గొనగా, పెన్షనర్ ఎం.వి.కృష్ణారావు టేబుల్‌ను, గాదె బసవేశ్వరరావు రూ.5 వేల నగదును, తుంగల చంద్రశేఖర్ రూ.5 వేల నగదు, బూసిరాజు వెంకటేశ్వరరావు రూ.5 వేలు నగదు పెన్షనర్ల సంఘానికి విరాళంగా అందజేశారు.



మండల కాపు సంఘం అధ్యక్షుల నియామకం

నాగాయలంక, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక జనాభాగా ఉన్న కాపులకు విదేశీ విద్య అందించాలని కాపు సంఘం రాష్ట్ర నేత ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాపులంతా ఐక్యతగా ఉంటే హక్కులను సాధించుకోవచ్చునన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో అవనిగడ్డ నియోజకవర్గం కాపు సంఘం సమావేశం జరిగింది. అవనిగడ్డ నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు భోగాది సోమశేఖరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కాపులకు ఏ సమస్య వచ్చినా పోరాడేందుకు ముందుంటానని తెలిపారు. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల కాపు సంఘాల అధ్యక్షులను సమావేశంలో ఎన్నుకున్నారు.



వృద్ధులకు స్వచ్ఛంద సేవ వెలకట్టలేనిది : మోటమర్రి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద సేవా సంస్థలు వృద్ధులకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. చిలకలపూడి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో స్టార్ స్కూల్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో నిర్మించిన గదిని సంస్థ అధ్యక్షుడు పి. శ్రీరామ్ ప్రారంభించారు. సభా కార్యక్రమంలో బాబాప్రసాద్ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్నపూర్ణ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కరెడ్ల సుశీల మాట్లాడుతూ, పాతికేళ్లుగా వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ, వృద్ధుల సేవలో ఎంతో ఆనందం ఉంటుందన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్, కార్పొరేటర్ అన్నం ఆనంద్, రిటైర్డు ఎంఈవో కె రాజేంద్రప్రసాద్, నూర్జహాన్, చింతయ్య తదితరులు మాట్లాడారు. శ్రీరామ్‌ను సత్కరించారు.

బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వైద్యశిబిరం



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వైద్యశిబిరాలు ప్రజారోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం, మచిలీపట్నం జైహింద్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇనకుదురుపేట జైహింద్ హైస్కూల్ ప్రాంగణంలో విజయవాడ మణిపాల్ హాస్పటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు జె. శివకోటేశ్వరరావు, సిహెచ్. రాజీవ్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య, బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు కందుకూరి సత్యనారాయణ శర్మ, కానుకొలను ఫణికిరణ్, ఎం. సుబ్రహ్మణ్యం, పి.వి. ఫణికుమార్, కాపవరపు చంద్రశేఖర్, వి.ఎస్.ఎస్.ఆర్. శర్మ, చిత్రపు తిరుమలరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ చోడవరపు లక్ష్మీప్రసూన, జైహింద్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ కాళీపట్నపు అచ్యుతరామయ్య, విష్ణుభొట్ల రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు

- ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- విద్యార్థి వికాస వాహిని ఆధ్వర్యంలో 15 మంది ఉపాధ్యాయులకు సత్కారం



స్టార్ కళాశాల అధినేత పి. శ్రీరామ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులే జాతి నిర్మాతలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థి వికాస వాహిని ఆధ్వర్యంలో మహతి కళావేదికపై ఆదివారం జరిగిన కార్యక్రమంలో బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యారంగంలో వస్తున్న మార్పులను ఉపాధ్యాయులు అందిపుచ్చుకోవాలన్నారు. విద్యా వికాస వాహిని వ్యవస్థాపక అధ్యక్షుడు వేములపల్లి కేశవరావు అధ్యక్షత వహించిన ఈ సభలో శతాధిక గ్రంథకర్త జి.వి.పూర్ణచంద్ జాతి భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు అనే అంశంపై ప్రసంగించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ, మాతృభాష పట్ల ఉపాధ్యాయులకు అభిమానం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నై విశ్వవిద్యాలయం రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ కావూరి సూర్యప్రకాశరావు, వేములపల్లి విజయ్, భవిష్య, మర్రి శ్రావణి తదితరులు సందేశమిచ్చారు. ఈ సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు శత జయంతి విద్యాసేవ పురస్కారాన్ని ప్రముఖ కవి డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్‌కు అందజేశారు. పిరాటి అర్చనకు మండలి వెంకట కృష్ణారావు శతజయంతి కళాసేవ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం స్టార్ కళాశాల అధినేత పి. శ్రీరామ్, విజయవాడ శారదా రామకృష్ణ విద్యాలయం ఉపాధ్యాయులు జె. సాయిరామ్‌ప్రసాద్, వడ్లమన్నాడు జడ్పీ ఉన్నత పాఠశాల టీచర్ కె.వి. ప్రసాదరావు, టీచర్లు తమ్మన వేణుగోపాలరావు (ఐనపూరు), అప్పినీడి పోతురాజు (నిడుమోలు), ఉమ్మిటి విద్యాధర్ (పెడన), ముంతాజ్ బేగం (మచిలీపట్నం), అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి (తోట్లవల్లూరు), అప్పికట్ల వాసుబాబు (మొవ్వ), కనగాల కోటేశ్వరరావు (ఊటుకూరు), డాక్టర్ పి.ఎస్.వి. శ్రీను (గుడ్లవల్లేరు), కె.దిలీప్‌కుమార్ (పెడన), ఎస్. రామకృష్ణప్రసాద్ (కొత్తయడ్లంక), యర్రంశెట్టి విజయ భారతి (మచిలీపట్నం), పి. నతానియేలు (బొమ్మినంపాడు)లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



స్వచ్ఛ సీహెచ్‌సీగా చల్లపల్లి ప్రభుత్వాసుపత్రి

చల్లపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి ప్రభుత్వాసుపత్రి స్వచ్ఛ సీహెచ్‌సీగా జిల్లా స్థాయి అవార్డును సాధించింది. మచిలీపట్నంలో కలెక్టర్ చేతులమీదుగా ఈనెల 6వ తేదీన అవార్డును అందుకోనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ బి.ఎస్.ఆర్.శ్రీనివాస్ తెలిపారు. టాయిలెట్ల నిర్వహణ, పరిశుభ్రత, సౌకర్యాలు, నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు, స్పష్టమైన సూచనలు, సందేశాలతో కూడిన బోర్డుల ఏర్పాటు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని స్వచ్ఛ సీహెచ్‌సీగా ఎంపిక చేశారు. జిల్లాలో మూడు ఆసుపత్రులను ఎంపికచేయగా, చల్లపల్లి సీహెచ్‌సీ ఒకటికావటం పట్ల వైద్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



స్వచ్ఛ అంగన్వాడీగా నారాయణరావునగర్ కేంద్రం

చల్లపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నారాయణరావునగర్ మోడల్ అంగన్వాడీ కేంద్రం(1) స్వచ్ఛ అంగన్వాడీగా జిల్లా స్థాయి అవార్డును సాధించింది. షేక్ ముంతాజ్‌బేగం అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తుండగా, కేంద్రం ఆవరణలో కిచెన్ గార్డెనింగ్, పరిశుభ్రత, పిల్లలకు ఆటవస్తువులు ఏర్పాటు, పర్యవేక్షణ తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. జిల్లాలో మూడు అంగన్వాడీ కేంద్రాలను అవార్డులకు ఎంపికచేయగా వాటిలో చల్లపల్లి మోడల్ అంగన్వాడీ కేంద్రం ఒకటి. సోమవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ చేతులమీదుగా అవార్డును అందుకోనున్నారు.



గ్యార్మీషరీఫ్ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ఆకులమన్నాడులో గ్యార్మీ షరీఫ్ వేడుక

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆకులమన్నాడులో జష్నే గౌస్ అజమ్ దస్తగిర్ (గ్యార్మీ షరీఫ్)ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారీ అన్నసమారాధన (తబ్రుఖ్) నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పోతన స్వామి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్, సర్పంచ్ ఎండీ రఫీ, ఎండి హఫీజ్, శివాజీ, షేక్ మున్నా, రహంతుల్లా, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



సొంత ఖర్చుతో గోతులు పూడ్చిస్తున్న రావెళ్ల ఉదయ్‌కుమార్

రావెళ్ల సేవా సమితి అభివృద్ధి పనులు

- రూ.1.20 లక్షలతో మంగళాపురంలో గోతులు పూడ్చివేత

చల్లపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మంగళాపురం గ్రామంలో ప్రధాన రహదారిపై పడిన గోతులను పూడ్చేందుకు రావెళ్ల కృష్ణసేవాసమితి ముందుకు వచ్చింది. చైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పనులు చేపట్టారు. రూ.1.20 లక్షలు ఖర్చు చేసి గోతుల్లో వెట్‌మిక్స్ వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారు. రహదారి గోతులమయంగా మారి వర్షం వస్తే నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. స్పందించిన ఉదయ్‌కుమార్ స్వచ్ఛందంగా ముందుకువచ్చి పనులు చేపట్టడంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

దళితవాడ నుంచి చెరువు వరకు ప్రధాన రహదారిపై పడిన గోతుల్లో వెట్‌మిక్స్ పోశారు. డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, టీడీపీ నేతలు రావెళ్ల విజయ్, చిన్నకృష్ణ, పరుచూరి కమలాకరరావు, సురేష్, రమణ, డొక్కు తిరుమలేష్, నిడమానూరి రామకృష్ణ, గూడవల్లి రాజేష్, ముచ్చు సుబ్రహ్మణ్యం, కొర్రపాటి జగన్, కొల్లూరి సతీష్, దాసరి అర్జున, మాలెంపాటి వేణు తదితరులు పనులను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి తమవంతుగా సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రజల ఇబ్బందులను తీర్చేలా రహదారికి మరమ్మత్తులు చేయించినట్లు ఉదయ్‌కుమార్ తెలిపారు.

ఆటోప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

చల్లపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆటోప్రమాద బాధితునికి అండగా నిలుస్తామని నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్ అన్నారు. నారాయణరావునగర్ ఎస్టీ కాలనీకి చెందిన కుంభా రవితేజ ఆటో ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితం కావటంతో వైద్యఖర్చులకు దాతలు ఆదివారం రూ.20 వేలను వెంకట్రామ్ చేతులమీదుగా అందజేశారు. గ్రామ పంచాయతీ ద్వారా సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి రూ.10 వేలు, రావెళ్ల కృష్ణసేవాసమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ రూ.8 వేలు, మరో దాత రెండు వేలు సమకూర్చగా, ఈ సహాయాన్ని బాధితునికి అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ, పీఏసీఎస్ చైర్మన్ వీరబాబు, పంచాయతీ కార్యదర్శి పివి.మాధవేంద్రరావు, నేతలు మోర్ల శివ, అడపా రాంబాబు, షేక్ నబీఘోరి, ఏపి.చంద్రశేఖరరావు, ఏఎంసీ డైరెక్టర్లు సూదాని నందగోపాల్, షేక్ ఇబ్రహీం, జనసేన నేతలు అడపా రవి, గోళ్ల ప్రసాద్, మిరియాల జితేంద్ర, తెలుగుయువత మేడికొండ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెడన నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గూడూరులో పేద వృద్ధులకు ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. చిట్టిగూడూరు గ్రామానికి చెందిన ఆరు కుటుంబాలకు యాదవ సంఘ ప్రతినిధులు సహాయ సహకారాలు అందించారు. కొలుసు చందు, వీర్ల కృష్ణయాదవ్, సీనియర్ జర్నలిస్టు పుట్టి కృష్ణప్రసాద్, బోయిన నాగరాజు, పల్లపోతు మోహన్, దండుబోయిన గణేష్, పిల్లంగోళ్ళ వెంకటస్వామి, న్యాయవాది పల్లపోతు అంకరాజు, నూనె కళ్యాణ్, ఆరెపు స్వామి పాల్గొన్నారు.



మానవత విద్యానిధికి విరాళాలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులను ఆదుకునేందుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ. 50 లక్షలతో విద్యానిధిని ఏర్పాటు చేసినట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సెంట్రల్ కమిటీ చైర్మన్ కోటేశ్వరరావు అన్నారు. సన్‌స్టార్ స్కూల్‌లో ఆదివారం జరిగిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యక్రమంలో మారుబోయిన కోటేశ్వరరావు అతిథిగా పాల్గొన్నారు. కోటేశ్వరరావుకు విద్యానిధి జిల్లా కన్వీనర్ శ్రీరామ్ తన వంతుగా రూ. లక్ష, తన తండ్రి గంగాధరరావు పక్షాన రూ. లక్ష మానవత సభ్యత్వం నుంచి రూ. లక్ష అందించారు. సేవా కార్యక్రమాల్లో మచిలీపట్నం మానవత ముందంజలో ఉందన్నారు. మానవత సేవా సంస్థ అధ్యక్షుడు జి. కిషోర్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కార్యదర్శి జె. వీరవెంకట సత్యనారాయణ, రిటైర్డు ఎంపీడీవో కె. కృష్ణమోహన్, కరెడ్ల సుశీల, అయ్యప్ప స్వామి, ఆదిత్య, హసీంబేగ్, రాజేంద్రప్రసాద్, నూర్జహాన్, చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎదురుమొండి దీవుల దుస్థితికి గత వైసీపీ ప్రభుత్వమే కారణం : లకనం

నాగాయలంక, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎదురుమొండి దీవుల గ్రామాల పరిరక్షణకు తక్షణం చర్యలు తీసుకోవాలని టీడీపీ, మత్స్యకార సంఘాల నేతలు లకనం నాగాంజనేయులు, నాగిడి తాతారావు, కర్రి కృష్ణమూర్తి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గొల్లమంద - జింకపాలెం కరకట్టను పటిష్ఠ పర్చటంలో గత వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అప్పటి రవాణా శాఖ మంత్రి పేర్ని నాని, ఇద్దరు కలెక్టర్లు, ఎదురుమొండిలో పర్యటించి కరకట్టలు పటిష్ఠపరుస్తామని హామీలు ఇచ్చినా పనులు మాత్రం జరగలేదని విమర్శించారు. వేలాది ఎకరాల వ్యవసాయ భూమి, ఏడు వేల జనాభా ఉన్న ఎదురుమొండి దీవి గ్రామాల రక్షణ కవచమైన కరకట్టను వెంటనే పటిష్ఠపర్చాలని కోరారు.

గౌరీప్రసాద్‌కు అప్సా ఐకాన్ అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డు



పెడన, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో విశిష్ట సేవలందించినందుకు విశ్వభారతి హైస్కూల్ అధినేత అనుముకొండ గౌరీప్రసాద్‌కు అప్సా ఐకాన్ అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. విజయవాడలోని సీతారామ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) వి. సుబ్రహ్మణ్యరాజు గౌరీప్రసాద్‌కు ఈ అవార్డు అందజేశారు.



మండలి కృష్ణారావుకు నివాళి

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శతజయంతి వేడుకల్లో భాగంగా 63వ రోజు ఆదివారం నాగాయలంకలోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నీటి సంఘం అధ్యక్షుడు కారంకి కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, శివాజీ, బండ్రెడ్డి మల్లిఖార్జున్, కూటమి నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కోడూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకృష్ణాపురం పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి.సుధాకర్ తెలిపారు. రామకృష్ణాపురం సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి ఊటగుండం ఫీడర్ క్రింద షెడ్యూల్ మెయింటినెన్స్ పనులలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. . ఊటగుండం, బసవన్నపాలెం గ్రామాల కింద ఉన్న ఆక్వా రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

అదుపులో డయేరియా

అవనిగడ్డ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ఏడు, ఎనిమిది వార్డుల్లో ఉచిత వైద్యశిబిరం ఆదివారం కూడా కొనసాగింది. ప్రస్తుతం డయేరియా పూర్తిగా అదుపులో ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యశిబిరం ఇన్‌చార్జ్ కె.తారక రామారావు తెలిపారు. ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.